క్లుప్తంగా

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



ఎల్లారెడ్డి : జీవదాన్ పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాలలో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు వారు పాఠశాలల్లో పరిశీలించగా పాఠశాలలో పుస్తకాల కట్టలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరగా పాఠశాలలో ఐఐటీకి సంబంధించిన పుస్తకాలు మాత్రమే ఉన్నాయని ఇతర పుస్తకాలు లేవని అన్నారు.

ఇది క్రీడామైదానమేనా?



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : క్రీడాకారుల సౌకర్యార్థం కోసం ప్రభుత్వం రూ. లక్షల్లో వెచ్చించి ప్రతిగ్రామంలో క్రీడామైదానాలను ఏర్పాటు చేశారు. కాని తాడ్వాయి మండలంలోని సంతాయిపేట్ గ్రామంలో ఉన్న క్రీడామైదానాన్ని చూస్తే ఇది క్రీడామైదానమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మైదనాంలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఖోఖో, స్పోర్ట్స్ ఎలాంటి ఆటలు ఆడేలా లేకుండా పోయింది. మండలంలోని మరి కొన్ని గ్రామాల్లో కూడా క్రీడామైదానాలు అధ్వాన్నంగా ఉన్నాయి. క్రీడామైదానాలు సరిగ్గా లేకపోవడంతో క్రీడాకారులు ఇతర స్థలాల్లో ఆటలు ఆడుతున్నారు. ఇప్పటికైనా క్రీడామైదానాన్ని ఆటలాడేవిధంగా మార్చాలని క్రీడాకారులు కోరుతున్నారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి



బాన్సువాడ రూరల్ : బాన్సువాడ డివిజన్ కేంద్రంలో కొనసాగుతున్న విద్యావ్యాపారాన్ని అరికట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బాన్సువాడలో మాట్లాడుతూ ఎలాంటి వసతులు లేకున్నా విద్యార్థులను మభ్యపెట్టి అడ్మిషన్లు చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలన్నారు. ఈసమావేశంలో విద్యార్థి నాయకులు షేక్ ఫిర్దోస్, సాగర్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్‌డ్రైవ్



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని హాజీపూర్ గ్రామంలో సోమవారం అధికారులు సైడ్ డ్రెయిన్‌లను శుభ్రం చేయించారు. వర్షాకాలం వస్తున్న సమయంలో ప్రతి గ్రామంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టాలని ఎంపీవో రాము ఆదేశించారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో కూలీలను పెట్టి డ్రెయిన్‌లను శుభ్రం చేయించి పారిశుధ్య లోపం లేకుండా చూడాలన్నారు.

ఎల్ఐసీ కామారెడ్డి మేనేజర్‌గా కృష్ణమోహన్



కామారెడ్డి అర్బన్ : ఎల్ఐసీ కామారెడ్డి శాఖ మేనేజర్‌గా ఎస్.కృష్ణమోహన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కృష్ణమోహన్ ఎల్ఐసీ కడప డివిజన్ తాడిపత్రి శాఖ నుంచి బదిలీపై కామారెడ్డికి రాగా, కామారెడ్డిలో మూడేళ్లుగా మేనేజర్‌గా ఉన్న ఎం తులసీరామ్ సౌత్ సెంట్రల్ జోనల్ హైదరాబాద్ కార్యాలయం న్యూ బిజినెస్ ఏవోగా బదిలీ అయ్యారు.

ఆలయం అభివృద్ధికి విరాళం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో ముత్యాల పోచమ్మ ఆలయం అభివృద్ధి కోసం దాతలు సోమవారం ఆలయ కమిటీకి విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన కమ్మరి పోచయ్య జ్ఞాపకార్థం తన కుమారుడు కిరణ్ ఆలయంలో టైల్స్ వేయించాడు. అదే గ్రామానికి చెందిన నీల బాల్‌లింగం రూ. 11,116 విరాళంగా ఇచ్చారు. వడ్ల సిద్దిరాములు మనుమడు అక్షిత్ కుమార్ జ్ఞాపకార్థం రూ. 5116 విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మంచం పట్టిన హన్మాజీపేట్

- విషజ్వరాల బారిన పడ్డ గ్రామస్తులు
- కీళ్లు, ఒళ్లునొప్పులతో నరకయాతన



హన్మాజీపేట్‌లో జ్వరంతో బాధపడుతున్న రాజు



జ్వరపీడితులు గొల్ల గంగారాం, గంగవ్వ

బాన్సువాడ రూరల్ : మండల కేంద్రానికి సుదూరంలో అటవీప్రాంతంలో ఉండే హన్మాజీపేట్‌లో ప్రతి ఇంట్లో కనీసం ఒకరిద్దరు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు.పక్షం రోజులుగా గ్రామంలో ప్రజలు తీవ్రజ్వరం, కీళ్లనొప్పులు, ఒళ్లునొప్పులతో మంచాన పడి అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని పీఎంపీల వద్ద వైద్యం చేసుకుని, తగ్గక పోవడంతో బాన్సువాడకు పరుగులు పెడ్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి చికిత్సలు అందించినా ఎలాంటి ఫలితం దక్కలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

నాణ్యమైన వైద్యం అందకపోవడంతో జ్వర పీడితులు బాన్సువాడ, బోధన్, నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. కేవలం రక్త పరీక్షలకే రూ. వేలు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. గ్రామంలోని 1, 7, 8 వార్డుల్లో జ్వరబాధితులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. తామంత రక్తపరీక్షలు చేయించుకుంటే చికున్‌గున్యా ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని గ్రామస్తులు పేర్కొన్నారు. తీవ్ర నొప్పుల మూలంగా యువతీయువకులు కూడా గోడలు పట్టుకుని, కర్రల సాయంతో నడవాల్సిన పరిస్థితి వచ్చిందని బాధపడ్తున్నారు. జ్వర బాధితులను పరామర్శించడానికి వచ్చిన ఇతర గ్రామాల వారు కూడా జ్వరం బారిన పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి స్పెషలిస్ట్ వైద్యులతో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి నాణ్యమైన వైద్యం, ఉచితంగా మందులు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేలల్లో ఖర్చయ్యాయి..



మా ఇంట్లో అందరికి విష జ్వరాలు వచ్చాయి. వైద్యం కోసం రూ. 10 వేలు దవాఖానాల్లో ఖర్చయ్యాయి. మా ఇంటాయన గొల్ల గంగారాంనకు ఇంకా నయం కాలేకపోవడంతో మంచానికి పరిమితమయ్యాడు. జ్వరం, ఒంటి నొప్పుల మూలంగా చాలా బాధ పడాల్సి వస్తుంది.

– గొల్ల గంగవ్వ, హన్మాజీపేట్

పీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నాం

గ్రామంలో చాలామంది జ్వరాల బారిన పడిన మాట వాస్తవమే. విషయం తెలిసి గ్రామంలోని జీపీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్సలు అందించాం. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలి. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలి. చికున్‌గున్యా బారిన పడిన వారు మందులతో పాటు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

– సాయిలు, హెచ్‌ఈవో, పీహెచ్‌సీ

యూనిఫాంలు త్వరగా కుట్టాలి



యూనిఫాం తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్

బాన్సువాడ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కోసం యూనిఫాంలకు త్వరగా కుట్టాలని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ సూచించారు. సోమవారం మండలంలోని కొత్తాబాదిలో యూనిఫాం స్టిచ్చింగ్ చేస్తున్న కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వ స్కూళ్లలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాల అభివృద్ధి పనులను ఎంపీవో సత్యనారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు.



చీనూర్‌లో కుట్టిన స్కూల్ యూనిఫాంలను పరిశీలిస్తున్న ఏపీఎం జగదీశ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం చేపట్టిన యూనిఫాం కుట్టు పనులను వేగవంతం చేయాలని నాగిరెడ్డిపేట ఐకేపీ ఏపీఎం జగదీశ్ సూచించారు. చీనూర్‌లో యూనిఫాం కుట్టు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈనెల 10వ తేదీ వరకు యూనిఫాంలను పంపిణీకి సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఆయనవెంట సీసీ రమేష్ ఉన్నారు.

పార్కులు, నర్సరీల పరిశీలన



బాన్సువాడ : బాన్సువాడ మున్సిపాలిటి కొత్తగా వచ్చిన కమిషనర్ శ్రీహరిరాజు సోమవారం పురపాలక సంఘం పరిధిలోని డైలీమార్కెట్, మటన్‌మార్కెట్‌లను పరిశీలించారు. అలాగే పార్కులు, నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది సతీష్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



భిక్కనూరు : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీఆర్‌ఎస్ నేతలు సోమవారం భిక్కనూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయపతాకాన్ని, బీఆర్‌ఎస్ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు శ్రీనివాస్, నాగార్తి భూంరెడ్డి, సాయగౌడ్, పైతరి స్వామి, పోతిరెడ్డి, మద్ది ప్రమోద్‌రెడ్డి, భాగ్య, గుడిసె యాదగిరి, తక్కళ్ల రవీందర్‌రెడ్డి, జిల్లెల రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీడీ వేతనాలను వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం

కామారెడ్డి రూరల్ : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 7 లక్షల మంది బీడీ కార్మికులకు, నెలసరి ఉద్యోగులకు, బీడీ ప్యాకర్లకు పెరిగిన వేతనాలు గతనెల నుంచే అమల్లోకి తీసుకురావాలని నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. వెయ్యి బీడీలకు రూ.4.25 పైసలు పెరిగాయని, కొత్త వేతన ఒప్పందం ప్రకారం బీడీ కార్మికులకు రూ.4.25 మేర వేతనం పెరగనుందన్నారు. బీడీ పరిశ్రమంమలో పనిచేసే ప్యాకర్లు, నెలసరి ఉద్యోగులకు వేతనాల ఒప్పందం కుదిరిందన్నారు. ప్రస్తుతం ఉన్న వేతనంపై రూ.1700 పెంచారు. ప్యాకింగ్ కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై నెలకు రూ.3,650 పెంచారన్నారు. ఈ సమావేశంలో బీడీ కార్మిక సంఘం ప్రతినిధులు చిట్యాల సిద్దిరాములు, ఎస్‌కే హస్సన్, రాజేందర్, రజిని, సుధాకర్, నర్సింలు పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు జాజాల శుభాకాంక్షలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావుకు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హరీష్‌రావు జన్మదినం సందర్భంగా సురేందర్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలను తెలియజేశారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ



శేషాద్రిని సన్మానిస్తున్న శ్రీ ఆర్యభట్ట కళాశాల సిబ్బంది

లింగంపేట(ఎల్లారెడ్డి) : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన పాలిసెట్ పరీక్షల్లో లింగంపేట మండలం మాలోత్ తండాకు చెందిన శేషాద్రి ఎంబైపీసీలో తెలంగాణ రాష్ట్రస్థాయిలో 13వ ర్యాంకు సాధించాడు. రాష్ట్రస్థాయిలో ఎంపీసీ విభాగంలో 75వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం శ్రీఆర్యభట్ట కళాశాల సిబ్బంది శేషాద్రితో పాటు తల్లిదండ్రులు మోహన్ కళావతిని సన్మానించారు.

మాచారెడ్డి నుంచి..

మాచారెడ్డి : పాల్వంచ మండలం మర్రి వద్ద నున్న ఆర్ఆర్ టాలెంట్ పాఠశాల విద్యార్థి కిష్టమ్మగారి లిఖిల్ గౌడ్ సోమవారం వెలువడిన పాలిసెట్ ఫలితాల్లో ఎంబైపీసీలో రాష్ట్ర స్థాయిలో 142ర్యాంక్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి తెలిపారు. అలాగే పదో తరగతిలో 10జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థిని అభినందించారు.



లిఖిల్ గౌడ్

భిక్కనూరు నుంచి..



సిరివెన్నెల

భిక్కనూరు : పాలిసెట్ – 2024 ఫలితాల్లో భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని ఎన్గు సిరివెన్నెల అత్యుత్తమ ప్రతిభ సాధించారు. సిరివెన్నెల ఎంపీసీ విభాగంలో రాష్ట్రవ్యాప్తంగా 366వ ర్యాంకును ఎంబైపీసీ విభాగంలో 222వ ర్యాంకును సాధించారు. సిరివెన్నెల భిక్కనూరు మండల కేంద్రంలో విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్‌లో పదోతరగతి చదివి పాలిసెట్ పరీక్షకు శిక్షణ పొందింది. ఈ సందర్భంగా సిరివెన్నెలను విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు.

సంఘసేవకుడు లాభిశెట్టి లక్ష్మయ్య మృతి



లాభిశెట్టి లక్ష్మయ్య

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు, సంఘసేవకులు లాభిశెట్టి లక్ష్మయ్య(86) వృద్ధాప్యంతో సోమవారం మృతి చెందారు. విద్యుత్‌శాఖలో అకౌంట్స్ అధికారిగా 1998లో ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మయ్య కామారెడ్డి పట్టణంలో పలు సేవ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. కామారెడ్డి స్మశాన వాటిక భూముల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడుగా పనిచేసిన లక్ష్మయ్య శ్మశాన వాటికల భూములు కబ్జా కాకుండా ప్రహారీల నిర్మాణంతో పాటు వాటికల నిర్మాణానికి కృషి చేశారు. లక్ష్మయ్య మృతికి రోటరీ, లయన్స్ క్లబ్, విశ్రాంత ఉద్యోగులు, విద్యుత్ శాఖ విశ్రాంత ఉద్యోగులు, పట్టణ ప్రముఖులు పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సంక్షిప్తం

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని అధ్యాపకుడు సంతోష్ తెలిపారు.అన్ని సబ్జెక్టులకు సంబంధించి అనుభవం ఉన్న అ ధ్యాపకులు ఉన్నారన్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు పొందవచ్చన్నారు.

విత్తనాల కోసం ఆందోళన

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలో పెద్దజనుము, జిలుగ విత్తనాలను మరొకసారి సరఫరాచేయాలని వివిధ గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈనెల 29వ తేదీన తాడ్వాయి, దేమికలాన్ సింగిల్ విండోలతో పాటు తాడ్వాయిలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం ద్వారా పెద్ద జనుము విత్తనాలను పంపిణీ చేశారు. అయితే 225 సంచులకు గాను కేవలం 40 శాతం మాత్రమే సంచులు రావడంతో రైతులు మరోసారి విత్తనాలుసరఫరాచేయాలనికోరుతున్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, పొల్యూషన్, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు సీటు బెల్ట్‌లు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఫలితాల కోసం బిగ్ స్క్రీన్

మద్నూర్(జుక్కల్) : మంగళవారం వెలువడనున్న పార్లమెంట్ ఎన్నికల ఫలితాల కోసం మండల కేంద్రంలోని రైతు వేదికలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేసినట్లు జుక్కల్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను ప్రతి ఒక్కరు ప్రత్యక్షంగా ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా బిగ్ స్క్రీన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన అన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ ముజీబ్ ఉన్నారు.

పచ్చదనంతో పల్లెదారులు..



అన్నాసాగర్ గ్రామానికి వెళ్లే దారిలో ఏపుగా పెరిగిన గుల్‌మహర్ చెట్లు

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్, అడ్విలింగాల శివానగర్ గ్రామాల రహదారుల వెంట హరితహారంలో భాగంగా కానుగ, వేప, చింత, కోనోకార్పస్ ,కబంద, గుల్‌మహర్, చైనాబాదాం మొక్కలు నాటగా అవి ప్రస్తుతం చెట్లుగా మారాయి. రహదారులకు ఇరువైపులా ఈ చెట్లు ఏపుగా పెరిగి వాహనదారులకు కనువిందు చేస్తున్నాయి.

కబ్జా కోరల్లో ఇరిగేషన్ భూములు



కబ్జాకు గురవుతున్న నిజాంసాగర్ ప్రధాన కాలువ భూములు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువకు ఇరువైపులా ఉన్న భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కట్టను తవ్వుతూ పంట పొలాలుగా మారుస్తున్నారు. నస్రుల్లాబాద్, లింగంపల్లి, బొప్పాస్ పల్లి, బొమ్మన్‌దేవ్ పల్లి గ్రామాల పరిధిలో గల నిజాంసాగర్ ప్రధాన కాలువను జేసీబీల సాయంతో తవ్వుతూ ఉండాల్సిన దానికన్నా సన్నగా మారుస్తున్నారు. లింగపల్లి వద్ద ఏకంగా షెడ్డులను ఏర్పాటు చేసి వాడుకుంటున్న వారు ఉన్నారు. అంతే కాకుండా ప్రధాన కాలువకు దగ్గరగా ఉన్న నీటి కుంట(బ్యాంకు)లను మట్టితో కబ్జా చేస్తున్నారు. పంటల కోసం నీరు వదిలిన సమయంలో బ్యాంకులో నిలువ చేసి తర్వత రైతులకు వాడుకోవడానికి ఉపయోగించేవారు. కాని వాటిని సైతం కబ్జా చేస్తే పంట పొలాలుగా మారుస్తున్నారు. నిత్యం ఇరిగేషన్ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదు. సంబంధిత అధికారులు మామూలుగా వ్యవహరిస్తూ కబ్జా దారులకు కొమ్ము కాస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

పేద ప్రజలకు అండగా ప్రభుత్వం



బాధితులకు చెక్కును అందజేస్తున్న షబ్బీర్ అలీ

బీబీపేట: రాష్ట్రంలో పేద ప్రజలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం బీబీపేట్ మండల కేంద్రానికి చెందిన గాడి లింగం భార్య లలిత అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెకు రూ. 3లక్షల ఎల్‌వోసీ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో సుతారి రమేష్, భూమాగౌడ్, శ్రవణ్‌కుమార్, సలీం ఆది రాజయ్య, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ



పెద్దకొడప్‌గల్ వ్యవసాయ సహకార సంఘంలో జీలుగ విత్తనాలు అందజేస్తున్న అధికారులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి సందీప్ కుమార్ మాట్లాడుతూ మండల ప్రాథమిక సహకార సంఘానికి 166 బస్తాలు రాగా మొదటి రోజు 25 జీలుగ విత్తనాల బస్తాలను పంపిణీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మాధవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పిట్లం సహకార సంఘం వద్ద విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో వీణ

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని సహకార సంఘం గోదం వద్ద సోమవారం సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు జీలుగ, జనుము విత్తనాల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విస్తీర్ణ అధికారిణి వీణ మాట్లాడుతూ ప్రభుత్వం జీలుగ, జనుము విత్తనాలు క్వింటాల్‌కు రూ.3720 ధరను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సిబ్బంది హన్మాండ్లు, రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో మట్టి దొంగలు



కోనాపూర్ చెరువులో మట్టిని తవ్వుతున్న పొక్లెయిన్లు

- యథేచ్ఛగా సాగుతున్న వ్యాపారం
- చోద్యం చూస్తున్న అధికారులు

బాన్సువాడ రూరల్ : వాల్టా చట్టం నీరుగారుతోంది. వాల్టా చట్టం ప్రకారం పట్టా భూమిలో మట్టి తవ్వాలన్నా అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాని మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల్లో పట్టపగలు యథేచ్ఛగా పొక్లెయిన్లు పెట్టి మరీ టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నెలరోజులుగా వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టి దందా కొనసాతోంది. ఒకవైపు ఇటుక బట్టీల యజమానులు చెరువు మట్టిని తీసుకెళ్లి తమ బట్టీల వద్ద గుట్టలుగా పేర్చుకుంటున్నారు. బాన్సువాడతో పాటు చుట్టుపక్కల శివారు గ్రామాల్లో వ్యవసాయ భూములను కొనుగోలు చేసిన రియల్టర్లు చెరువుల్లోని మట్టితో భూములను చదును చేసి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు. దీంతో బాన్సువాడ మండలంలో మట్టిదందా స్వేచ్ఛగా సాగుతోంది.

తిష్టవేసిన యంత్రాలు..

మండలంలోని కోనాపూర్ చెరువుతో పాటు సోమేశ్వర్, తిర్మలాపూర్ తదితర గ్రామ చెరువుల్లో నుంచి నిత్యం వందలాది టిప్పర్లతో మట్టిదందా కొనసాగుతోంది. మట్టి తవ్వి నింపడం కోసం ఒక్కో చెరువలో నాలుగైదు పొక్లెయిన్లు చెరువులో తిష్టవేశాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. యంత్రాలతో మట్టి తవ్వడం వల్ల చెరువులో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. చెరువులో సుమారు 15 ఫీట్లలోతు వరకు గుంతలు తవ్వుతుండటంతో భవిష్యత్‌లో మనుషులు, పశువులు గుంతల్లో పడి మృత్యువాత చెందే ప్రమాదం పొంచి వుంది. చెరువుల్లో తీసిన గుంతల్లో పడి ఇప్పటికే జిల్లాలో చాలాచోట్ల చాలామంది మృత్యువాత పడ్డారు. అరకొర వర్షాలు కురిస్తే చెరువులో మట్టి తరలింపు కోసం తీసిన భారీ గుంతలే నిండి సాగునీరు తూము వరకు నేరుగా చేరే అవకాశం ఉండదు.

అధికారుల కనుసన్నల్లోనే..

చెరువులే కేంద్రంగా కొనసాగుతున్న అక్రమ మట్టి దందా విషయమై రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా వారు పెడచెవిన పెడ్తున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో అధికారుల కనుసన్నల్లోనే వ్యాపారం కొనసాగుతోందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా 'మామూలు' తనిఖీలతో సరిపెట్టకుండా, చిత్తశుద్ధితో చెరువులను రక్షించి, ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.